

బోగస్‌లు బద్దలు..!





డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్

- బయటపడుతున్న అక్రమార్కులు
- ఎక్స్-సర్వీస్‌మెన్ కింద అడ్డదారిలో దరఖాస్తు
- దొరికిపోయిన ఇద్దరు అభ్యర్థులు
- ఉద్యోగాలు వద్దంటూ లేఖలు
- ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు
- అయోమయంలో విద్యాశాఖ
- అర్హత అభ్యర్థుల్లో టెన్షన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల్లో బోగస్‌లు బయటపడుతున్నాయి. బోగస్ సర్టిఫికెట్లతో ఎంపికైన వారు రీ వెరిఫికేషన్‌లో అడ్డంగా దొరికిపోతున్నారు. ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేక బృందాలు పరిశీలన చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 807 పోస్టులకుగాను 770 మంది అభ్యర్థుల జాబితా రావడంతో జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాలలో వెరిఫికేషన్ చేపట్టారు. ఇంకా 37మంది అభ్యర్థుల జాబితా విడుదల కావాల్సి ఉంది. ఇప్పటివరకు సెలెక్ట్ జాబితాలో వచ్చిన పలువురు అభ్యర్థులు బోగస్ సమాచారం పెట్టి దరఖాస్తు చేయగా.. వెరిఫికేషన్‌లో సంబంధిత సర్టిఫికెట్లు చూపించలేక పట్టుబడిపోతున్నారు. పలువురు బోగస్ ఈడబ్ల్యూఎస్ (ఆర్థికి బలహీన వర్గాల) సర్టిఫికెట్లు పెట్టారని ఫిర్యాదులు అందాయి. రాష్ట్రశాఖ మరోసారి అభ్యర్థులు ఇచ్చిన సర్టిఫికెట్లను మాన్యువల్‌గా పరిశీలించి, సమాచారం పంపాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గురువారం పాత డీఈఓ కార్యాలయంలో ఇప్పటి వరకు వచ్చిన 770 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి రీవెరిఫికేషన్ చేపట్టారు. ఇందులో మరో రెండు బోగస్ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి.

ఉద్యోగాలు చేస్తూ.. ఎక్స్ సర్వీస్‌మెన్ కింద దరఖాస్తు

డీఎస్సీ నియామకాల్లో ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ప్రత్యేక కోటా ఉంటుంది. ఆ కోటా అభ్యర్థులకు అర్హత మార్కులు ఉంటే ఉద్యోగాలు ఇస్తారు. ఈ పోస్టులను దక్కించుకునేందుకు ఇద్దరు అభ్యర్థులు అదికూడా ఇప్పటికే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు దరఖాస్తు చేసుకుని, అడ్డంగా దొరికిపోయారు. ఇది విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ సబ్జెక్టులో ఇప్పటికే ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తున్న అభ్యర్థి ఎక్స్ సర్వీస్‌మెన్ కింద దరఖాస్తు చేసుకున్నాడు. ఈయన పేరు మొదట విడుదల చేసిన సెలెక్షన్ జాబితాలోనే వచ్చింది. ఈయన పీవీకేకేలో జరుగుతున్న వెరిఫికేషన్‌కు హాజరుకాగా.. పరిశీలన బృందం ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరింది. దానిని చూపించకపోగా.. తాను ఇప్పటికే ఎస్జీటీ టీచర్‌గా పని చేస్తున్నానన్నాడు. దీంతో కమిటీ బృందం నవ్వుకుని, అలా అయితే రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పింది. అందుకు అతడు (మిగతా 6లో...)

నేడు మిలాద్ ఉన్ నబీ

- వేడుకలకు సిద్ధమైన ముస్లింలు



← గౌస్ మొద్దీన్ నివాసంలో గంధం వద్ద ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు, ముస్లింలు

అనంతపురం టౌన్/క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. జిల్లాలోని మసీదులు, దర్గాలలో సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. 'జులుసే మహ్మదీయా' పేరుతో ఉదయం శాంతిర్యాలీలు, మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. సాయంత్రం మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనం ఉంటుంది.

గంధం ఊరేగింపు

మిలాద్-ఉన్-నబీ వేడుకలలో భాగంగా అనంతపురం నగరంలో జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పామిడి దర్గాకు వెళ్లి గంధం సమర్పించారు. మధ్యాహ్నం దాదాపు 2 వేల మందికి అన్నదానం చేశారు. సేవతోనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా గౌస్ మొద్దీన్ అన్నారు. వేడుకలలో ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, సత్యనారాయణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, గుంటూరు మేయర్ నాని, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేయం షకీల్ షఫి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, విజయవాడ గ్రథాలయ సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు, టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ఆదినారాయణ, తాజుద్దీన్, స్వప్న, పీఎల్ఎన్ మూర్తి, స్వామిదాస్, ఎన్‌బీకే ఫ్యాన్స్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వామ్మో.. విశాఖ వెళ్లాలా..?

- త్వరలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ నోటిఫికేషన్
- జోనల్ కేంద్రంగా విశాఖపట్టణం
- గుంతకల్లు డివిజన్‌కు బహుదూరం
- అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు తిప్పలు



గుంతకల్లు రైల్వే స్టేషన్

గుంతకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే జోన్ మారాల్సి రావడం గుంతకల్లు డివిజన్‌కు ఎన్నో కష్టాలు తెచ్చిపెట్టనుంది. జోనల్ కేంద్రంగా విశాఖపట్టణాన్ని ఏర్పాటు చేస్తుండడంతో గుంతకల్లుకు దూరం కానుంది. జోనల్ కేంద్రానికి వెళ్లాలంటే అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు చాలా ఇక్కట్లు పడాల్సిందే. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉన్న ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ సమయం దగ్గరపడింది. నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదలచేసి, దసరా తర్వాత దక్షిణ కోస్తా రైల్వేజోన్ సొంత కార్యకలాపాలు, పరిపాలన సాగించే విధంగా మార్గం సుగమమౌతోంది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి ఏపీకి కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ప్రకటన చేసింది. ఇప్పటిదాకా జీఎంను, మూడు శాఖలకు చీఫ్ ఇంజనీర్లను నియమించింది. ఇంకా పలు శాఖల హెచ్ఓడీలను నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారిక నోటిఫికేషన్ త్వరలో వెలువడనుందని సమాచారం. నెలాఖరులోగా గెజిట్ నోటిఫికేషన్ వెలువడి దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాచరణ ప్రారంభం కానుంది. గుంతకల్లు రైల్వే డివిజన్ దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి నుంచి దక్షిణ కోస్తా రైల్వేజోన్ పరిధిలోకి మారనుంది. ఈ మార్పు ద.కో.రై. డివిజన్‌లోని ఇతర డివిజన్లకు ఎటువంటి ఇబ్బంది లేకపోగా, జోనల్ కేంద్రానికి అతి దూరంలో ఉన్న గుంతకల్లు డివిజన్‌కు మాత్రం కష్టాలు తెచ్చిపెట్టనుంది.

ప్రజలు, ప్రజాప్రతినిధులకు కష్టాలు

దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కేంద్రం విశాఖపట్టణంలో ఏర్పడనుండగా ఇటు ప్రజలు, అటు రాయలసీమ (మిగతా 6లో....)

టీచర్స్‌డేకి ఏర్పాట్లు పూర్తి

నేడు 76మందికి ఉత్తమ అవార్డులు ప్రదానం

అనంతపురం విద్య, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల డ్రామాహాల్‌లో శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వేడుకల నిర్వహణకు నిధులను మంజూరు చేసింది. ఈవేడుకలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్, కార్పొరేషన్ చైర్మన్లు, కలెక్టరు, జేసీ, సీఈఓలను ఆహ్వానించారు. వీరి చేతులు మీదుగా ఉత్తమ అవార్డులకు ఎంపికైన టీచర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు అంద జేయనున్నారు.


వేడుకలకు సిద్ధమైన వేదిక

సత్కారాలకు ఎంపిక

జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులకు 76మంది టీచర్లను ఎంపిక చేశారు. ఈజాబితాకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆమోదం వేయడంతో గురువారం డీఈఓ ప్రసాద్‌బాబు అధికారికంగా ప్రకటించారు. ఇందులో ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు 11, మోడల్ ప్రైమరీ స్కూల్స్ పీఎస్‌హెచ్ఎంలు 05, స్కూల్‌అసిస్టెంట్లు అన్నికేడర్లు కలిపి 32మంది ఉండగా, పీడీలు 11మంది ఉన్నారు. ఎస్జీటీచర్లు 17మంది ఉన్నారు.

అవార్డులకు ఎంపికైన టీచర్లు వీరే..

ప్రధానోపాధ్యాయులు

ఫణీంద్రనాథ్, వేణుగోపాల్, సోమశేఖర్, ఆదిశంకర్, వెంకటేశులు, సీకే సుబ్రహ్మణ్యం, సుధ, డేనియల్, సర్వమంగళ, నవీదా, గంధం శ్రీనివాసులు

స్కూల్ అసిస్టెంట్లు, పీడీలు

వాణిశ్రీ చూడామణి, సాయిలీల, సుశీల, ఎం.సిద్దేశ్వరస్వామి, జీ.నారాయణస్వామి, కే.రవీంద్ర, కే.శ్రీధర్, బీ.సూరిబాబు, జీ.రఘురామ్, ఎన్.క్రిష్ణమోహన్‌రెడ్డి, ఏ.వెంకటజయశంకర్, జే.వెంకోబారావు, జేకేశివశరణప్ప, పీ.నందకుమార్, ఎస్.రవీంద్ర, టీ.రజనీకుమారి, జీ.వ.జయమేరీ, ఆర్.తులసీనాయక్, ఎస్ఆర్.రాజమణి, ఎం.శ్రీదేవి, పీ.సునీత, కేఆర్.సునీత, వీణాకాళిదాసరాజు, ఈ.మాధవి, కే.సరిత, జే.సూర్యనారాయణ, డీ.అగస్టియన్ కుమార్, కే.అశోక్‌నాయక్, ఎం.కాశసుదాకరరావు, కే.హెప్సీసరోజ, ఎం.నాగరాజు, యు.కోటప్ప, ఎం.జయరాముడు, బీ.శర్మాసుజాన్, కే.క్రిష్ణమూర్తి, బీ.గీతాలక్ష్మి, ఏ.పవన్‌కుమార్, ఎం.హరినాథ్, పీ.లక్ష్మన్న, పీ.శివప్రసాద్ నాయుడు, పీ.వేణుగోపాల్, జీ.చిత్తయ్య, కే.శ్రీనివాసులురెడ్డి, ఎ.ప్రభావతి, సీహెచ్.బాలగోవింద్, టీఎం.వెంకటేష్, ఎం.చంద్రశేఖర్, ఆర్‌సీ.అక్కులప్ప

ఎస్జీటీ టీచర్లు:

ఎ.శ్రీరాములు, పీ.వజీర్‌బాషా, ఎస్.సరళ, వీ.మారెన్న, బీ.నాతలక్ష్మి, యు.శ్రీనివాసులు, వై.కే.ఎల్.రంగమ్మ, పీ.సరస్వతి, ఎన్.వినీత, పి. రాధ, కే.శ్రీదేవి, ఎస్.ఆశా, ఎ. అర్జున్, కే.వీ.వన్నప్ప, ఎం.వెంకటాచలపతి, ఎస్.మహేష్‌కుమార్, ఎల్.రాజేశ్వరి.

సబ్ రిజిస్ట్రార్ రమణరావుపై సస్పెన్షన్ వేటు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ రమణరావుపై సస్పెన్షన్ వేటు పడింది. డీఐజీ విజయలక్ష్మి గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ భూములు, ఆస్తుల డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారమే సస్పెన్షన్‌కు ప్రధాన కారణం. సాయినగర్‌లోని రెండు దుకాణాలు, నారాయణపురంలో 9.50ఎకరాలు భూమి డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం వివాదాస్పదమైంది. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలోనే రమణరావును సస్పెండ్ చేశారు. కాగా రమణరావు పదిరోజులుగా సెలవులో ఉన్నారు.

జ్ఞానదాతలు.. స్ఫూర్తి ప్రదాతలు

వినూత్నరీతిలో బోధనతో ఆదర్శంగా టీచర్లు

సొంత డబ్బుతో విద్యాలయాల అభివృద్ధికి కృషి

5

ప్రైవేటు ఆస్పత్రిలో వికటించిన అబార్షన్

- శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన యువతి మృతి
- సిబ్బంది అబార్షన్ చేయడమే కారణం..?


కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో టెకీ మృతదేహాన్ని తీసుకెళ్తున్న వ్యక్తులు

5



సూపర్ హిట్ చేస్తాం

- వైసీపీ దుష్ప్రచారాలు తిప్పికొడతాం
- టీడీపీ ప్రజాప్రతినిధులు
- సభ నిర్వహణకు అనంతలో చురుగ్గా ఏర్పాట్లు
- పర్యవేక్షించిన కలెక్టర్, డీఐజీ, ఎస్పీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు


ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 10న జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్‌ను సభను విజయవంతం చేస్తామని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. శ్రీనగర్‌కాలనీలోని జీఎంఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రాజు, విప్ కాలవశ్రీనివాసులు, అనంతపురం దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తదితరులు గురువారం పర్యవేక్షించారు. సభాప్రాంగణంలో వేదిక ఏర్పాటు, సభాస్థలికి సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర ప్రముఖులు వచ్చే రూట్లు, భద్రతాప్రమాణాలు, పార్కింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలపై చర్చించారు. తర్వాత ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ రాయలసీమ నాలుగు జిల్లాల్లో నూటికి నూరు శాతం కూటమికి సీట్లు అందించిన జిల్లా అనంతపురం అన్నారు. సూపర్ సిక్స్- సూపర్‌హిట్‌పై వైసీపీ విషప్రచారాలు చేస్తోందన్నారు. యూరియాపై ఘోరంగా విష ప్రచారం చేశారన్నారు. వైఎస్ఆర్ రెండుసార్లు, జగన్ 5 ఏళ్లు సీఎంగా ఉన్నా హంద్రీనీవా పూర్తి చేసి, పులివెందులకు ఎందుకు నీళ్లు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఏడాదిన్నరలోనే సీఎం చంద్రబాబు హెచ్ఎన్ఎస్ఎస్‌ను పూర్తి చేశారన్నారు. రాబోయే మూడేళ్లలో సీమను ఏవిధంగా అభివృద్ధి చేస్తామో ఈ సభద్వారా చెప్పి, వైసీపీ విష ప్రచారాలను తిప్పికొడతామన్నారు. టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ నిర్వహించిన అన్ని సభల్లో కన్నా ఈ అనంతపురం సభను జయప్రదం చేస్తామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభను టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కరువు జిల్లాకు సీఎం చంద్రబాబునాయుడు వస్తున్నారంటే ఈ జిల్లాకు మరో వరం ఇవ్వబోతున్నారన్న ఆశ, ఆనందం తమలో ఉందన్నారు. గత ఐదేళ్లలో అధ్వానంగా ఉన్న రోడ్లు పవన్‌కళ్యాణ్ కృషి వల్ల బాగవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, తలారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, డీఐజీ, ఎస్పీ పర్యవేక్షణ

సీఎం టూర్ కార్యక్రమాలను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ గురువారం ఉదయమే పర్యవేక్షించారు. సీఎం టూర్ నేపథ్యంలో హెలీప్యాడ్ ఏర్పాటు కోసం నగరంలోని అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలో టాటా మోటార్స్ ఎదురుగా ఉన్న ఉలవచారు రెస్టారెంట్, నెక్సా షోరూమ్ పక్కనున్న స్థలాలను పరిశీలించారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి సభాప్రాంగణాన్ని పరిశీలించారు. ఎస్పీ జగదీష్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సీఎం టూర్‌పై చర్చించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీఓ కేశవనాయుడు డీఎస్పీలు శ్రీనివాసురావు, వెంకటేశ్వర్లు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 హత్యకు ప్రతీకారం

- రౌడీ షీటర్‌ను నరికేసిన ప్రత్యర్థులు


తలారి లోకేంద్ర(ఫైల్)

జులాయిగా తిరుగుతూ, గంజాయికి అలవాటు పడ్డ ఓ యువకుడు కేవలం రూ.15 ఆటో బాడుగ కోసం ఓ వ్యక్తిని బండరాయితో మోది చంపేశాడు. దీనికి అతని కుమారుడు ప్రతీకారం తీర్చుకున్నాడు. తన స్నేహితుడితో కారుతో ఢీకొట్టించి, వేట కొడవళ్లతో నరికేశాడు. ధర్మవరం పట్టణంలో గురువారం జరిగిన ఈ హత్య కలకలం రేపింది. హతుడు ఓ రౌడీ షీటర్. ఇప్పటికే రెండు హత్య కేసులు, ఓ దాడి కేసు సహా పలు నేరాలు చేశాడని పోలీసులు తెలిపారు. అందుకే రౌడీషీట్ ఓపెన్ చేశామని అంటున్నారు. అతని పేరు తలారి లోకేంద్ర. ఈ ఏడాది మార్చిలో ఓ మహిళను ఆటోలో పొలాల్లోకి తీసుకెళ్లి, అత్యాచారం చేసి చంపేసిన కేసులో ప్రధాన నిందితుడు. (వివరాలు 5వ పేజీలో)


తలారి లోకేశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, గుమిగూడిన ప్రజలు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 575 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.34.67 కోట్లు మంజూరైనట్లు డీపీఓ నాగరాజనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వెయ్యిలోపు జనాభా ఉన్న 45 పంచాయతీలకు టైడ్ గ్రాంట్ కింద రూ.71,27,685, అన్ టైడ్ గ్రాంట్ కింద రూ.47,51,867 పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. వెయ్యికి మించి జనాభా ఉన్న 530 పంచాయతీలకు టైడ్ గ్రాంట్ కింద రూ. 20,00,20,838, అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.13,48,14,131 జమ అయ్యాయన్నారు.

మొత్తం 575 పంచాయతీలకు టైడ్ గ్రాంట్ కింద రూ.20,71,48,523, అన్‌టైడ్ గ్రాంట్ కింద 13,95,65,998 జిల్లాలోని పంచాయతీ ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.



భూ సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం కుసుమ్‌కు సంబంధించి 21 సబ్‌స్టేషన్ల పరిధిలో భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పలు శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పీఎం కుసుమ్‌కు సంబంధించి ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంబంధిత తహసీల్దార్లు, వీఆర్వోలు, రైతులతో మాట్లాడి భూ సమస్య పరిష్కరించాలన్నారు. అలాగే రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని జీజీహెచ్ డాక్టర్ల అటెండెన్స్ రోజువారిగా అందించాలన్నారు. అలాగే జిల్లాలోని పీహెచ్‌సీలలో మందులను అందుబాటులో ఉంచాలన్నారు. సానుకూల ప్రజా అవగాహనకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో మరింత పురోగతి తీసుకురావాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, జెడ్పీ సీఈఓ శివశంకర్, నగర కమిషనర్ బాలస్వామి, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనపై ఇంటింటి ప్రచారం


కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పీఎం నరేంద్ర మోదీ చేపట్టిన 11 ఏళ్ల సుపరిపాలనపై బీజేపీ నాయకులు గురువారం ప్రచారం చేపట్టారు. స్థానిక కమలానగర్‌లో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పామిశెట్టి నాగరాజు,కమలానగర్ అధ్యక్షుడు చిత్రాల రాజేష్, ఎస్టీ మోర్చా రంజిత్‌చౌహాన్, ఎస్సీ మోర్చా మల్లెబుల శివ, మహిళా మోర్చా దేవిరెడ్డి లక్ష్మిదేవి, నాయకులు ప్రసాద్, విశ్వాచారి, శ్రీనివాసులు, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

రామగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగావతి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం కానుందన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్లు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. అధికారులు అయా శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

మధ్యప్రదేశ్, ప్రెసిడెంట్ జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, ప్రెసిడెంట్ జట్లు విజయం సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండో రోజూ కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ సెక్రటరీ లెవెన్ జట్టు, ఏసీఏ ప్రెసిడెంట్ లెవెన్ జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ ప్రెసిడెంట్ 49.1ఓవర్లలో 232పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో బ్యాటర్లు ప్రణీత్‌పవన్ 65, లోహిత్ లక్ష్మీనారాయణ 41 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన సెక్రటరీ జట్టు 30.4 ఓవర్లలో 161పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో హృతిక్‌వర్మ 70పరుగులు చేశాడు. ఏసీఏ ప్రెసిడెంట్ జట్టు బౌలర్లు సాహిల్ హమీద్ 5, సాయిచరణ్ 4వికెట్లు తీసి జట్టు 71పరుగుల తేడాతో గెలుపొందింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బరోడా, మధ్యప్రదేశ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన బరోడా జట్టు 45.4ఓవర్లలో 178పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ జట్టు 45.4ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 182పరుగులు చేసింది. బ్యాటర్లు స్పర్శ్ డాకర్ 45, మనల్ చౌహాన్ 55 పరుగులు చేసి జట్టుకు 2వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు.

ముగిసిన వర్క్‌షాప్


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్యతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమ ఆలోచనలను.. నూతన ఆవిష్కరణల వైపు వెళ్లేలా మలుచుకోవాలని సూచించారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్ట్ నమూనాలను వారు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వసుంధర, బీసీడీఈ సెక్రటరీ ఆచార్య దేవకుమార్, బీసీడీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్, విజ్ఞాన్ ఆశ్రం ప్రతినిధులు పవన్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15 వరకూ ప్లాన్ గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తీసుకొచ్చిన "ఫ్రీడమ్ ప్లాన్" గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పొడిగించినట్లు ఆ శాఖ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక ఆఫర్‌ను ఈ నెల 15 వరకూ పొడిగిస్తున్నామన్నారు.

రాష్ట్ర విద్యావిధానాన్ని అమలు చేయాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం రూరల్/ వైద్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేసి రాష్ట్ర విద్యా విధానాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులతో సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 2020లో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలున్నాయన్నారు. ఇది రాష్ట్ర అధికారాలను కుంగదీసే విధంగా ఉండటమేగాక, విద్యను ప్రైవేటీకరణ వైపు నడిపిస్తోందన్నారు. ప్రజా చర్చ లేకుండా నాలుగేళ్ల డిగ్రీ, స్థానిక భాషల పతనం వంటి మార్పులు తీసుకొస్తూ విద్యను మార్కెట్ వశం చేస్తున్న ఈ విధానాన్ని వ్యతిరేకించాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అర్చన, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

రాప్తాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎం పీడీఓ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు, రిజిస్టర్లు, భూ సర్వేకు సంబంధించిన రిపోర్టులు పరిశీలించారు. అలాగే మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఆడిట్‌తో సొసైటీల్లో అక్రమాలకు చెక్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను ఆన్‌లైన్ చేసిన క్రమంలో ఈ-ఆడిట్‌తో అక్రమాలకు చెక్ పెట్టొచ్చని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో గురువారం సహకార సొసైటీల ఈ-ఆడిట్‌పై ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ గతంలో కంప్యూటరీకరణ చేయని సమయంలో సొసైటీలపై అనేక అక్రమ ఆ రోపణలు వచ్చేవని, దీంతో ఆడిట్‌పై కూడా అవకతవకలు ఉండేవని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ చేసిన క్రమంలో సొసైటీల్లో ఈ ఆడిట్ చేసి నిర్వహణను పారదర్శకంగా చేపట్టవచ్చన్నారు. ఆడిట్ నివేదిక నిర్ణీత గడువులోపు పూర్తిచేసి అందజేయాలని సూచించారు. డీసీఓఏ నాగవీణ, డీఎల్‌సీఓ వెంకటరామిరెడ్డి, అధ్యాపకులు, సొసైటీల సీఈఓలు, సహకార శాఖ ఆడిటర్లు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన వారికి శిక్షణ: జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన వారికి ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని జడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. శ్రీకాళహస్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేస్తామని వెల్లడించారు. రికార్డులు పక్కాగా ఉండాలన్నారు.

శింగనమల మార్కెట్ చైర్మన్‌గా దండు శ్రీనివాసులు



శింగనమల/బుక్కరాయసముద్ర, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్‌గా దండు శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసిం ది. మండలంలోని తరిమెల పంచాయతీ చింతమేకలపల్లి గ్రామానికి దండు ఆదిమూర్తి, దేవమ్మ దంపతుల కుమారుడు దండు శ్రీనివాసులు తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేసేవారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయనకు మార్కెట్ యార్డు పదవి రావడంపై శింగనమల మండలంలో అనుచర వర్గం, టీడీపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేయడంతో ఈ పదవి దక్కిందన్నారు. పదవి రావడానికి కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే బండారుశ్రావణీశ్రీ, ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. వీటితో పాటు నియోజకవర్గంలో యార్డుకు సంబంధించి 10 ఎకరాల భూమి బీకేఎస్‌లో కేటాయించినా ఇప్పటి వరుకు భవనాలు, కార్యాలయం లేవన్నారు. త్వరలోనే యార్డుకు సంబంధించి ఎమ్మెల్యే శ్రావణీశ్రీ సహకారంతో అభివృద్ధిపనులు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి

● అధికారులకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా ఫైళ్లను క్లియర్ చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు చురుకుగా పని చేయాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల్లో డాక్టర్లు, సిబ్బంది సమయవేళలను పాటించాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ తీరుపై దృష్టిసారించి పారదర్శకంగా సేవలందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించడంతో పాటు పరిపాలనా అంశాల్లోనూ సమస్యల్లేకుండా పని చేయాలని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌ఓగా రెండేళ్లు పూర్తి చేసుకున్న డాక్టర్ ఈబీ దేవికి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర్ రావు, డీఐఓ యు గంధర్, పీఓ నారాయణస్వామి, ఏహెచ్ఎం శ్రీనివాసులరెడ్డి, ఎస్ఓ మహమ్మద్ రఫీ, ఎస్ఓ డీఎంఓ ఓబులు, డీపీహెచ్ఎన్ఓ ప్రమీల, డెమో త్యాగరాజు, హెచ్ఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిన్నంపల్లిలో జలజీవన్ మిషన్ కింద జరుగున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనుల్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం పరిశీలించారు. డీఈ శ్రీధర్, జేఈ శివకుమార్, సర్పంచు శివశంకర్ పరిశీలించి ట్యాంకు నిర్మాణాన్ని నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మడకశిర ఎమ్మెల్యే సొంతూరికి ప్రత్యేక నిధులు

శింగనమల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సొంతూరు అయిన అలంకరాయునిపేటలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించారు. తమ సొంతగ్రామమైన మండలంలోని రాచేపల్లి పంచాయతీ అలంకరాయునిపేట గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని శింగనమలలో గత జనవరి 6న జరిగిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు ఎంఎస్ రాజు వినతిపత్రం అందజేశారు. దీంతో ప్రభుత్వం మొదటి విడతగా ఎన్ఆర్‌జీసి కింద గ్రామంలో సీసీ రోడ్డు వేయడానికి రూ.58 లక్షలు కేటాయించింది. ఇప్పటికే సీసీ రోడ్డు వేయడానికి అధికారులు సమాయాత్తమయ్యారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: డీఆర్వో

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ మలోల ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌కు సంబంధించిన పరీక్షలపై డీఆర్ఓ సమీక్షించారు. అనంతరం డీఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 7న ఈ పరీక్షలకు సంబంధించి ఆఫ్‌లైన్ మోడ్/ఓఎంఆర్ ఆధారిత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.40గంటల వరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 18 కేంద్రాలలో నిర్వహించే ఈ పరీక్షలలో ఉదయం సెషన్‌లో 7221 మంది, మధ్యాహ్నం 1314మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పని చేసి పరీక్షలను సజావుగా జరిగేలా సూచించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, సెక్షన్ ఆఫీసర్లు భోగేశ్వరి, పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

మజీద్ ఏ రహమత్ కమిటీకి ఆర్థిక సాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయితీ చంద్రబాబు నగర్‌లో గల మజీద్ ఏ రహమత్ కమిటీకి ఎంఎస్ఎస్ సేవా సంస్థ వారు గురువారం ఆర్థిక సాయం అందించారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని రూ.12వేలు ఆర్థిక సాయాన్ని మజీద్ కమిటీ సభ్యులకు అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు సాదిక్ వలి, ఎంపీటీసీ సభ్యులు మహబూబ్‌బీ పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎంగా గంధం శ్రీనివాసులు



అనంతపురం విద్య, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరీక్షల మండలి(డీసీఈబీ) కార్యదర్శి, కళ్యాణదుర్గంలోని కరణంచిక్కప్ప ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న గంధం శ్రీనివాసులు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ పాఠశాలలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు టెన్త్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతను తీసుకొస్తున్నారు. ఆ స్కూల్లో స్థానిక ఎంఎల్‌ఏ అమిలినేని సహకారంతో దాదాపు రూ50లక్షల వ్యయంతో వివిధ వసతుల కల్పనకు కృషి చేశారు. మరో వైపు జిల్లా పరీక్షలమండలి కార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వవిధానాలకు అనుగుణంగా పరీక్షలనిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈసేవలను గుర్తించిన ఉన్నతాధికారులు ఆయన్ను జిల్లాస్థాయి ఉత్తమ హెచ్‌ఎంగా అవార్డుకు ఎంపిక చేశారు.

వైద్య కళాశాల ఏడీగా సాయిగ్రేస్


సాయిగ్రేస్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ షారోన్ సోనియ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా సాయి గ్రేస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీ సాయి గ్రేస్.. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పరదేశినాయుడు, ఏఓ చౌడేశ్వరి, ఆఫీస్ సూపరింటెండెంట్ అతావుల్లా తదితరులు నూతన ఏడీకి శుభాకాంక్షలు తెలిపారు.

ముసలయ్య నియామకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆదివాసీ ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ముసలయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు నుంచి తనకు నియామక పత్రం అందినట్లు గురువారం ఆయన పేర్కొన్నారు. ఎరుకుల కులస్థుల అభివృద్ధి, సంక్షేమ కోసం కృషిచేస్తానని తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన

నార్పల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ. పప్పూరు గ్రామ జడ్పీహైస్కూల్లో విద్యార్థినులకు గురువారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ భారతి మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఈనెల 12వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్‌చట్టం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తర్వాత కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధ, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శాంతరాజ్, రమణారెడ్డి, సూపర్‌వైజర్ మధుమాలిని, అంగన్‌వాడీ వర్కర్లు తిరుపాలమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం వైద్యం: వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని విద్యార్థినులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. నగరంలోని పాతూరులో గల కేజీబీవీలో విద్యార్థినులక ఆమె కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్ మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కేయూకి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్కింగ్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్‌లో ఎస్కేయూకి మెరుగైన స్థానం లభించింది. బోధన, అభ్యాసం, వనరులు, పరిశోధన, పరీక్షా ఫలితాలు అదితర అంశాలపై దేశంలోని విశ్వవిద్యాయాల సంస్థాగత స్థాయిని ఎన్ఐఆర్ఎఫ్ లెక్కిస్తుంది. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో 10-100 మధ్యలో ఎస్కేయూ ఎంపికైంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబుతోపాటు కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు హర్షం వ్యక్తంచేశారు.

ప్రైవేటు ఎరువుల షాపుల వద్ద పర్యవేక్షణ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియాకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రైవేటు ఎరువుల షాపుల వద్ద రైతు సేవా కేంద్రం సిబ్బందికి పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, అనంతపురం ఏఓ వెంకట్‌కుమార్ గురువారం అనంతపురం నగరంలోని 6 ప్రైవేటు ఎరువుల దుకాణాలకు రైతు సేవాకేంద్రం సిబ్బందిని నియమించారు. శ్రీనివాసఫర్టిలైజర్స్, న్యూశ్రీనివాస్ ఫర్టిలైజర్స్, సాయి కృష్ణ ట్రేడర్స్, రంగస్వామి ఫర్టిలైజర్స్, లక్ష్మీరంగ అగ్రి సెల్యూషన్స్, లక్ష్మీ ట్రేడింగ్ కార్పొరేషన్ షాపులకు ఒక్కొక్కరి చొప్పున సిబ్బందిని నియమించారు. యూరియా స్టాక్ పూర్తయ్యే వరకు దుకాణాల యజమానులు ఆ సిబ్బంది సమక్షంలోనే రైతులకు యూరియా విక్రయాలు జరిపేలా నిర్ణయం తీసుకోవడం జరిగందని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా గురుపూజోత్సవం

● సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల కరెస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్‌తో పాటు ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి జ్ఞాపికలు అందజేశారు. తర్వాత గురువుల ప్రాశస్త్యం గురించి హెచ్‌ఎంలు కృష్ణవేణి, అనిత ప్రసంగించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయులని కొనియాడారు.

బచ్‌పన్‌స్కూల్లో..

అనంతపురం విద్య: రాంనగర్‌లోగల బచపన్‌స్కూల్లో గురుపూజోత్సవ వేడుకల సందర్భంగా ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు టీచర్లను పూజించి పాదాభివందనం చేశారు. కరెస్పాండెంట్ దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.


నవభారత్ స్కూల్లో ఆటలపోటీల్లో పాల్గొన్న టీచర్లు


బచ్‌పన్ స్కూల్లో సర్వేపల్లికి నివాళులు..

ఘనంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

అనంతపురంటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భాద్రపద శుక్ల ద్వాదశిని పురస్కరించుకుని తపోవనం శివశక్తిసాయి ఆలయంలో గురువారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అర్చకుడు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి తదితర ప్రాంతాల్లో నారాయణసేవ నిర్వహించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆధ్యాత్మికవేత్త మనూరు నాగరాజరావు, ఆలయ ధర్మకర్త శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌దే భవిష్యత్తు'

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల గొంతుగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీదే భవిష్యత్తు అని ఆపార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ అసమర్థతపై ప్రజల చూపును మరల్చే విధంగా కేంద్రంలోని బీజేపీ కొత్తనాటకాలకు తెరలేపుతోందన్నారు. పాలకులు పని చేయకుండానే దేశాన్ని అభివృద్ధి చేస్తామని గొప్పలకు పోతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో వైఎస్ షర్మిల అధినాయత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టబోతుందని పేర్కొన్నారు. అనంతరం జాతీయ మానవ హక్కుల నాయకులు నవాజ్ జాకీర్ హుస్సేన్‌కు కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల వాసు, నాయకులు రామాంజి, ప్రసాద్‌రెడ్డి, హరి, శర్మాస్‌వలి, షఫి, పద్మావతి, శంకర్, నరేష్, ఓబులేసు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి: ఎన్ఎస్‌యూఐ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓట్లచోరీ నిలువరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు రాష్ట్రపతికి పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ అత్యున్నత వ్యవస్థ భారత ఎన్నికల సంఘం బీజేపీ తొత్తుగా మారి పౌరుల హక్కు కాలరాస్తోందని మండిపడ్డారు. లక్షలాదిగా ఓట్లను చోరీ చేసి ఓటర్లను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధారాలను బహిర్గతం చేసినా రాష్ట్రపతి స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాని కార్యదర్శి నరేష్ , జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి బదిలీ

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం మార్కెట్ కమిటీ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు బదిలీ అయ్యారు. ఆమేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన ఓడీఐగా ఆదోనికి బదిలీ కావడం జరిగింది. ఈయన స్థానంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.





జ్ఞానదాతలు..

స్ఫూర్తి ప్రదాతలు

- వినూత్నరీతిలో బోధనతో ఆదర్శంగా టీచర్లు
- సొంత డబ్బుతో విద్యాలయాల అభివృద్ధికి కృషి

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



టీచింగ్ అనేది ఒక ప్రొఫెషన్ మాత్రమే కాదు అది ఒక ఆర్ట్ అంటూ పలువురు టీచర్లు తమ బో ధనాతీరుతో నిరూపిస్తున్నారు. తమకున్న జ్ఞాన సంపదను విద్యార్థులకు వినూత్న రీతుల్లో చే రవేస్తున్నారు. ఇందుకు కొందరు టీచింగ్‌ఎయిడ్స్‌ను ఎంచుకుంటే మరికొందరు దానికి టె క్నాలజీని జోడించి ముందుకు సాగుతున్నారు. బోధనే పరమావధిగా మారుతున్న సాంకేతికను అందిపుచ్చుకుంటూ యూట్యూబ్ చానళ్లు ప్రారంభించి విద్యాభ్యసనను సులభతరం చే స్తున్నారు. దర్శనికతతో పాఠాలు బోధిస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీ సుకెళ్తున్నారు. కేవలం బోధనతోనే సరిపెట్టకుండా పాఠశాల పురోభివృద్ధికి సైతం శ్ర మిస్తున్నారు. ఈక్రమంలో సొంత డబ్బును సైతం ప్రతిఫలాపేక్షలేకుండా ఖర్చు పెడుతూ ఆ దర్శంగా నిలుస్తున్నారు ఈ గురువులు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో తమ సేవలతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కొందరు కృషీవలుర గురించి ఇలా...

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అనంతపురం)

జీవం ఉట్టిపడేలా బోధన



జీవశాస్త్ర పాఠాలను సాంకేతికత ద్వారా బోధిస్తున్న ప్రసాద్



ఉపాధ్యాయుడు మేడా ప్రసాద్, హనకనహాళ్

బోధనకు సాంకేతికను జోడించి అద్భుత ఫలితాలు సాధిస్తున్నాడు కణేకల్లు మండలం హనకనహాళ్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మేడా ప్రసాద్. పవర్ పాయింట్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నాడు. బయాలజీ బ్రాడ్ కాస్టింగ్ అనే పేరుతో ఒక వాట్సప్ చానల్‌ను ఏర్పాటు చేసి తన స్కూల్ విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులకు కూడా సబ్జెక్ట్ సంబంధిత విషయాలను బోధిస్తున్నారు. ఈ గ్రూపులో దాదాపు 1850 మంది విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. అలాగే టెస్టుమోజ్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా జీవశాస్త్రానికి సంబంధించి సుమారు 300 టెస్టులు విద్యార్థులకు అందుబాటులో ఉంచగా రాష్ట్రస్థాయిలో వీటిని వేలాది మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వినియోగించుకుంటున్నారు. బయాలజీ డిజిటల్ బడి పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉండే వీడియోలు తమ పాఠశాల విద్యార్థులు నిర్వహిస్తున్న కృత్యాలను ప్రదర్శిస్తున్నారు. ఇన్‌స్పైర్ మనక్ పోటీలు, సదరన్ ఇండియన్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలుతో పాటు వివిధ వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలలో విద్యార్థులు పాల్గొనేలా మార్గదర్శకత్వాన్ని అందజేస్తున్నారు. ఇలా ఒక సారి జాతీయ పోటీలకు, ఎనిమిది సార్లు రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు పాల్గొనేలా తర్ఫీదు ఇచ్చారు.



కొత్తపేట బాలుర ఉన్నతపాఠశాలలో స్వంతఖర్చులు రూ.5లక్షలతో ఏర్పాటు చేయించిన భోజనశాలషెడ్ (ఫైల్‌ఫొటో)



గోరకాటి పెద్దారెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు

మూడు దశాబ్దాలుగా ఒకే పాఠశాల

మూడు దశాబ్దాలుగా ఒకే చోట పని చేస్తూ పాఠశాల, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు ధర్మవరం కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డి. 1988లో ఈ పాఠశాలకు వచ్చిన ఆయన విద్యార్థులకు సులభతరమైన రీతిలో బోధిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. విధుల్లో చేరిన కొత్తలో పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సొంత డబ్బు వెచ్చించి అభివృద్ధి చేశాడు. మొదట తన తల్లిదండ్రులు గోరకాటి తిమ్మమ్మ, గోరకాటినారాయణరెడ్డిల జ్ఞాపకార్థం రూ.లక్ష వెచ్చించి రెండు గదులను నిర్మాణం చేపట్టారు. ఆతరువాత పాఠశాలలో క్రీడా మైదానాన్ని తన సొంత డబ్బు రూ.5లక్షలు వెచ్చించి బాగు చేయించారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి వీలుగా తన సొంత డబ్బు రూ.5లక్షలతో షెడ్‌ను ఏర్పాటు చేయించారు. ఇక చిన్న చిన్న పనులైతే చెప్పలేనన్ని చేశారు. దీంతో 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. ఇటీవలే పట్టణంలోని లోనికోట ఉర్దూ పాఠశాలకు బదిలీపై వెళ్లారు.

పిల్లలతో ఇంగ్లిష్‌లో మాట్లాడించాలని..



ఓబుళరెడ్డి, గడేకల్లు

విడపనకల్లు మండలం గడేకల్లు హైస్కూలు ఇంగ్లిష ఉపాధ్యాయుడు ఓబుళరెడ్డి సరికొత్త పంథాలో విద్యా బోధన చేస్తున్నాడు. రానున్న నవంబరులోపు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులందరూ ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడేలా కృషి చేస్తున్నారు. పాఠశాలలో ఉన్న మరో ఇద్దరు ఇంగ్లిష ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు బోధన ప్రారంభించారు. పనిచేస్తున్న పాఠశాల పేరుపై యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేసి, ఇంగ్లిష్ గ్రామర్ బోధన, స్పోకెన్ ఇంగ్లిష వీడియోలను తయారుచేసి అప్‌లోడ్ చేశారు. కేవలం తన పాఠాలనే కాకుండా విద్యార్థులు మాట్లాడే ఇంగ్లిషను కూడా రికార్డు చేసి వీడియోలను అప్‌లోడ్ చేస్తూ వారికి ప్రేరణ కలిగిస్తున్నారు. వచ్చే నవంబరు 23న పుట్టపర్తికి విద్యార్థులను తీసుకెళ్లి ఫారినర్స్‌తో ఇంగ్లిషలో మాట్లాడించాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నారు. సగం ఖర్చును భరించి విద్యార్థులను విహారయాత్రలకు కూడా తీసుకెళ్తున్నారు.

ఎక్కడున్నా వందశాతం ఉత్తీర్ణత



టీచర్ ప్రోత్సాహంతో మట్టి వినాయకుడిని తయారు చేస్తున్న విద్యార్థులు



ప్రధానోపాధ్యాయుడు బాబా ఫక్రుద్దీన్

పరిగి ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న బాబా ఫక్రుద్దీన్ తన సొంత నిధులతో పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. స్వతహాగా ఇంగ్లిష్ ఉపాధ్యాయుడైన ఈయన విద్యార్థుల కోసం గ్లింపెస్, అడ్వాన్స్ ఇంగ్లిష్ గ్రామర్, యాక్టివిటీస్ ఇంగ్లిష్, మై ఇంగ్లిష్ గ్రామర్ మేడ్ ఈజీ, ఆబ్జెక్టివ్ ఇంగ్లిష్ గ్రామర్ వంటి పుస్తకాలు రచించారు. ఈయన ఎక్కడ పని చేసినా అక్కడ పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాడు. ప్రతిఏటా ఇంటర్, ఐటీఐలో విద్యార్థులను చేర్ప డం, డ్రాపౌట్ కాకుండా చూస్తున్నారు. గత జూన్‌లో సొంత నిధులతో పాఠశాలకు కంప్యూటర్లు అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్ ఇస్తూ వేలమందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ఊటకూరు, కొడిగెనహళ్లి నుంచి వచ్చే విద్యార్థులకు మూడు నెలలుగా ప్రయాణ ఖర్చు భరిస్తున్నారు. 2019లో ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డుపొందారు.

విజ్ఞాన గని 'బండి'



అవార్డులు చూపుతున్న శ్రీనివాసులు

గుత్తిరూరల్ మండలంలోని అబ్బేదొడ్డి జడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు. తన అపార జ్ఞాన సంపదతో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జాతీయ స్థాయి అవార్డును సాధించారు. ఈయన తయారు చేసిన కాంతి, ధర్మాలు సులువుగా వివరించే బోధనోపకరణాల ప్రాజెక్టు దక్షిణ భారత దేశ స్థాయికి ఎంపికైయింది. బెంగళూరులో టాటా విండ్, పవర్, అగస్త్య, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో క్విజ్, పోస్టర్ మేకింగ్ విభాగాల్లో 10 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా బండి శ్రీనివాసులు తరఫున 10 మంది విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ చూపారు. హైబ్రిడ్ స్ట్రీటు లైటింగ్, సోలార్ అగ్రికల్చర్, స్ప్రేయింగ్, రోబోట్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. గత 11 సంవత్సరాల నుంచి సూపర్ 60 ప్రోగ్రాం కింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్, ఆర్జీటీసెట్‌కు శ్రీనివాసులు ఉచితంగా బోధన చేస్తున్నారు.



బెంగళూరులో ప్రదర్శనకు విద్యార్థులతో హాజరైన శ్రీనివాసులు

గురు(వు)మూర్తి



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న గురుమూర్తి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన గురుమూర్తి బోధనలో వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నారు. 1996లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరినప్పటి నుంచి బోధనలో ప్రత్యేకతను చాటుకుంటూ వస్తున్నాడు. ఆయన పనిచేసిన ప్రతి ప్రాథమిక పాఠశాలలోనూ విద్యార్థులు ఉచ్చారణ దోషాలు లేకుండా పదాలు పలుకుతారు. సంస్కృత శ్లోకాలు, ఇంగ్లిషు, హిందీ చదువుతారు. నీతి పద్యాలను అనర్గళంగా అప్పజెబుతారు. చేతిరాతలో నైపుణ్యం సాధిస్తారు. ఇదంతా గురుమూర్తి కృషి వల్లే సాధ్యమైంది. ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేసిన గ్రామాలలో విద్యార్థులు ఏ ఒక్కరు ప్రైవేటుపాఠశాలలకు వెళ్లరంటే అది అతిశయోక్తికాదు. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించాలన్న తపనతో రామాయణం, మహాభారత గ్రంథాల్లోని నీతి సారాన్ని బోధిస్తారు. వృత్తిపట్ల ఈయనకున్న నిబద్ధతను గుర్తించిన ప్రభుత్వం 2008లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ప్రస్తుతం ఈయన కంబదూరు మండలం కురాకులపల్లిలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డుల జాబితా విడుదలైంది. ఇందులో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. ఎస్ శారద, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఓంప్రకాష్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి వీరు అవార్డులు అందుకోనున్నారు. అవార్డులు దక్కడం పట్ల అధ్యాపకులు సంతోషం వ్యక్తంచేశారు.

ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి అవార్డు

కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డా. శ్రీధర్ కొనంకి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 13 ఏళ్ల అధ్యాపక వృత్తిలో 25 జాతీయ సెమినార్లకు హాజరై, పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. 20 పరిశోధనలు, వ్యాసాలు, ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ పుస్తకం రాశారు. గతంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు అకడమిక్‌తోపాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికవడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.



ఈశ్వర్‌రెడ్డి



ఓం ప్రకాష్



శారద



శ్రీధర్

ఏటీఎం కార్డు మార్చి రూ.27వేలు స్వాహా

గార్లదిన్నె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు మార్చి ఓ రైతు ఖాతా నుంచి రూ. 27 వేలు స్వాహా చేశాడు ఓ దుండగుడు. మండలంలోని కొట్టాలపల్లికి చెందిన రైతు పురుషోత్తం పని నిమిత్తం గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. డబ్బు అవసరం పడడంతో మార్గమధ్యలో వడియంపేటలో ఏటీఎం వద్దకు వెళ్లాడు. ఏటీఎంలో డబ్బు తీసుకోవడానికి ప్రయత్నించాడు. డబ్బులు రాలేదని వెనక్కు వెళ్తున్న రైతును అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తాను తీసిస్తానని నమ్మబలికాడు. రైతు పురుషోత్తం ఏటీఎం కార్డును ఆ వ్యక్తికి ఇచ్చాడు. ఏటీఎంలో డబ్బులు లేవని చెప్పి ఆ వ్యక్తి ఏటీఎం కార్డును మార్చి వేరొక దానిని రైతుకు తిరిగి ఇచ్చాడు. దీంతో రైతు అక్కడి నుంచి బయల్దేరాడు. కాసేపటికి తన ఖాతా నుంచి రూ.27వేల నగదు డ్రా అయినట్లు రైతు పురుషోత్తం మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. వెంటనే గార్లదిన్నెలోని యూనియన్ బ్యాంకుకెళ్లి సిబ్బందికి మెసేజ్‌ను చూపించాడు. ఖాతా నుంచి డబ్బు డ్రా అయిందని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్న రైతు వెంటనే ఏటీఎం కార్డును బ్లాక్ చేయించి, గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రైవేటు ఆస్పత్రిలో వికటించిన అబార్షన్

శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన యువతి మృతి

సిబ్బంది అబార్షన్ చేయడమే కారణం..?

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడితో సాన్నిహిత్యం కారణంగా ఓ టెకీ గర్భం దాల్చింది. కారణమేమిటోగానీ, ప్రియుడి సూచన మేరకు అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకుని ప్రాణాలు కోల్పోయింది. వైద్యులు కాకుండా, సిబ్బంది అబార్షన్ చేయడం ఆమె మరణానికి కారణమని విశ్వసనీయంగా తెలిసింది. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ మండల కేంద్రానికి చెందిన యువతి కర్ణాటకలోని ఓ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేసేవారు. డిగ్రీలో తన క్లాస్‌మేట్‌ను ఆమె ప్రేమించారు. అతను ఎంఎస్ పూర్తి చేసి, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఇద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఆమె గర్భం దాల్చింది. ఈ విషయాన్ని ఇంట్లో పెద్దలకు చెప్పి ఉంటే సమస్య పరిష్కారమయ్యేది. కానీ ఏం జరిగిందో.. ఆమె ఒంటరిగా అబార్షన్‌కు వెళ్లారు. ప్రియుడి సూచన మేరకే గత నెల 29న ఆమె అనంతపురం నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఒంటరిగా వెళ్లారని సమాచారం. అక్కడ వైద్యులు కాకుండా, అంబులెన్స్ టెక్నీషియన్, ఓ మహిళ, మరో ఇద్దరు పురుషులు కలిసి అబార్షన్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆమెకు అధిక రక్తస్రావం కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలని బయలుదేరారు. మార్గ మధ్యంలో, గుత్తి వద్ద ఆమె ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లిన అంబులెన్స్ డ్రైవర్, మరొకరు.. తమకు సంబంధం లేనట్లు వ్యవహరించారు. ఆమెను వైద్యం కోసం తెస్తుండగా మృతిచెందిదని అక్కడ నమోదు చేయించారని సమాచారం. అక్కడి వైద్యాధికారుల సమాచరాంతో గుత్తి పోలీసులు రంగంలోకి దిగారు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ ఫుటేజీని, అబార్షన్ జరిగిన అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వివరాలు సేకరించారు. రమేష్, అభిషేక్, రామకృష్ణ నాయక్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఆదినారాయణ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది.

ఏడుగురికి ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఏడుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న మాధవి, ఆనంద్‌ప్రసాద్, శకుంతల, కమలాబాయి, జడ్పీ కేటగిరి కింద ఏఓలుగా ఉన్న శ్రీనివాసులు ఉమాదేవి, జయరాములు పదోన్నతి పొందారు.

రూ.15 హత్యకు ప్రతీకారం

ధర్మవరంలో రౌడీ షీటర్ దారుణ హత్య

ధర్మవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రౌడీ షీటర్ తలారి లోకేంద్ర(26)ను ప్రత్యర్థులు గురువారం హత్య చేశారు. ధర్మవరం కొత్తపేటలోని శ్రీనిధి మార్ట్‌వద్ద ప్రధాన రహదారిపై తన స్నేహితుడితో కలిసి బైక్‌పై కూర్చుని ఉండగా, వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. లోకేంద్ర కింద పడగానే కారు నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి వేట కొడవళ్లతో విచక్షణారహితంగా నరికేశారు. అనంతరం అదే కారులో పారిపోయారు. లోకేంద్ర ఆటో నడిపేవాడు. ఏడాది క్రితం ధర్మవరం రైల్వే స్టేషన్‌లో శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తితో ఆటో బాడుగ విషయంలో గొడవపడ్డాడు. కేవలం రూ.15 చెల్లించే విషయంలో విభేదించి, అర్ధరాత్రి సమయంలో బండరాళ్లతో కొట్టి చంపేశాడు. ఈ కేసులో లోకేంద్ర ప్రధాన నిందితుడు. ఈ ఏడాది మార్చి 16న ధర్మవరం మండలం రేగాటిపల్లి పొలాల్లో అక్కమ్మ అనే మహిళను ఆటోలో తీసుకెళ్లి అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో కూడా ప్రధాన నిందితుడు. 2019లో ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్‌లో హోంగార్డు నాగభూషణంపై దాడి చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నేర చరిత్ర ఆధారంగా రౌడీ షీట్ తెరిచారు. లోకేంద్రకు వివాహం కాలేదు. అతని తండ్రి భైరవుడు కొత్తపేట సర్కిల్‌లో బొప్పాయి కాయలను అమ్ముతుంటారు. గతంలో కొత్తపేటలో నివసించే లోకేంద్ర, ప్రస్తుతం కేతిరెడ్డి కాలనీ ఎల్-2లో ఉంటున్నాడు. ప్రతిరోజూ కొత్తపేటకు వచ్చి రాత్రి వరకు ఉండేవాడు. గంజాయికి అలవాటుపడి జులాయిగా తిరిగేవాడు. హత్య విషయం తెలియగానే సీఐ నాగేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా హత్య చేసినవారిని గుర్తించారు. శ్రీనివాసులు రెడ్డి హత్యకు ప్రతీకారంగా, ఆయన కుమారుడు బాలకృష్ణారెడ్డి తన స్నేహితుడి సహకారంతో ప్రతీకార హత్య చేశాడని సీఐ తెలిపారు. గతంలో శ్రీనివాసులురెడ్డి కుమారుడు లోకేంద్ర తండ్రి వద్దకు వెళ్లి 'నీ కొడుకును ఏదో ఒక రోజు చంపేస్తాం. ఎన్ని రోజులు దాక్కుంటాడో చూస్తాం' అని హెచ్చరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. హతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి: డీఎంఓ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) ఓబులు ఆదేశించారు. గురువారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదముందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో గ్రామాల్లో పర్యటించి సర్వే నిర్వహించాలని సూచించారు. డెంగీ, మలేరియా తదితర జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే నివేదికలను ఆరోగ్య కేంద్రాల డాక్టర్లకు, మండల పరిషత్ అధికారులకు, ఈఓఆర్డీలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు రామకృష్ణ, శ్రీనివాస రావు, జయరాంనాయక్, దేవలాల్ నాయక్; శివయ్య, గోపీ నాయక్, రామాంజినేయులు, లక్ష్మీనాయక్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ నాల్గవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం వర్సిటీలోని పరీక్షల విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, పరీక్షల కంట్రోలర్ శ్రీరాములు నాయక్, సూపరింటెండెంట్ మారుతి విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పరీక్షలు మే, జూన్‌లో నిర్వహించడం జరిగిందన్నారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో చూసుకోవచ్చునన్నారు.


కర్ణాటక వాసి దారుణ హత్య

అమడగూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులోల్లపల్లి సమీపంలోని వంకలో కర్ణాటక రాష్ట్రంలోని బిళ్లూరు పంచాయతీ దేవరంక గ్రామానికి చెందిన ముత్తప్ప (47) బుధవారం రాత్రి హత్యకు గురయ్యాడు. కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి చెందిన శ్రీనివాసులరెడ్డితో కలిసి ముత్తప్ప రెండేళ్లుగా వ్యవసాయం చేస్తుండేవాడు. వీరు ఆకులోల్లపల్లి సమీపంలో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవారు. ముత్తప్ప నిత్యం స్వగ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి వచ్చేవాడు. రోజువారీలాగానే వ్యవసాయం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి తలపై గొడ్డలితో నరికారు. దీంతో ముత్తప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ముత్తప్ప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్తుండగా వంక గట్టున విగత జీవిగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఓడీసీ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 514 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో హెడ్ ఆఫ్ బ్రాండ్స్‌గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

● ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూఫెర్రర్

తనకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ పేర్కొన్నారు. మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉషోదయ మహిళ పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన బ్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా రుణాలు పొంది అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు బ్యాంక్‌లో పొదుపు చేసే సొమ్ముకు 50 పైసలు వడ్డీ చెల్లిస్తారన్నారు. బ్యాంక్‌లో రుణాలు పొందిన మహిళలకు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ రఘురాం, ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్, మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘం సభ్యులు, బీడీడీ సభ్యురాళ్లు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

కుమ్మర్లను గుర్తించిన ఘనత టీడీపీదే..!

రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుమ్మర్లను గుర్తించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ అన్నారు. మండలంలోని రాచానపల్లి గ్రామ సమీపంలోని కుమ్మర శాలివాహన కమ్యూనిటీ హాల్లో గురువారం కుమ్మర కులస్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. కుమ్మర సాధికార సమితి శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈశ్వర్ హాజరై మాట్లాడారు. కుమ్మర్లు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ ఇందుకు అనువైన వేదికన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మర్లకు మంచి స్థానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యలో రాణిస్తున్న కుమ్మరి పిల్లలకు చేయూతనివ్వాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరమైన సమస్యల కారణంగా రుణాల మంజూరుకు మరికొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, రైతు సంఘం ప్రధానకార్యదర్శి యాలేటి గోపాల్, ఆంజనేయులు, మల్లికార్జున, వెంకటనారాయణ, కిష్ట, హనుమంతు, రాజేంద్ర, తేజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుమ్మర శాలివాహన రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్

10న జాబ్‌మేళా

ధర్మవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల సురేష్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ గురువారం తెలిపారు. జాబ్ మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఎంపికైన వారికి నెలకు జీతం రూ.15 వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాద్, బెంగళూరు, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజిలెన్స్ దాడులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు చేసి, నోటీసులు అందించారు. గురువారం ఏడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు దుకాణాల్లో ఎరువుల నిల్వలు స్టాక్‌కు, ఈపోష్ మిషన్లలో ఉన్న డేటాకు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. రూ. 4.33 లక్షల విలువైన 15.90 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు ఆపాలంటూ నోటీసులు అందించారు. దాడుల్లో డీఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసు ప్రకాష్ పాల్గొన్నారు.

వామ్మో.. విశాఖ వెళ్లాలా..?

(3వ పేజీ తరువాయి)

జిల్లాల ప్రజాప్రతినిధులకు కష్టాలు తెచ్చిపెట్టనుంది. రైల్వే ఉద్యోగులు చనిపోయిన సందర్భాల్లో కారుణ్య నియామకాలు పొందేవారు జీఎం ఆఫీసుకు వెళ్లాల్సి వస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కారుణ్య నియామకాలు సాధారణంగా డీఆర్ఎం పరిధిలో పరిష్కారం అవుతాయి. డీఆర్ఎం తిరస్కరిస్తే అప్పీల్ కోసం జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ద.మ.రై. జోనల్ కేంద్రం సికింద్రాబాద్ రైలు మార్గంలో 365 కి.మీ.లు, బస్సు మార్గంలో 347.6 కి.మీ.ల దూరం ఉంది. కొత్త జోన్‌లోకి మారితే రైలు మార్గంలో వెళ్లాలంటే 783 కి.మీ.లు ఉండగా, బస్సు మార్గంలో 808.5 కి.మీ.ల దూరం ఉంది. ఎంపీలు ఏదైనా రైల్వే సమస్యలు, ప్రతిపాదనల విషయంగా జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తే రెండు రోజుల సమయం పడుతుంది.

ఉద్యోగులకూ కష్టాలే...

రైల్వే జోనల్ కేంద్రం దూరమైపోనుండడం రైల్వే ఉద్యోగులు, అధికారులకు సమస్యగా మారనుంది. రైల్వే ఆస్పత్రుల్లో పనిచేసే మినిస్టీరియల్ స్టాఫ్, వైద్యాధికారులు శిక్షణా కార్యక్రమాలకు సాధారణంగా రైల్వే జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. లోకో పైలెట్లు, చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్లు, గార్డులు ట్రైనింగ్ కోసం జోన్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే జోనల్ సీనియారిటీ కిందకు వచ్చే ఎస్ఎస్ఈ (డీజిల్), ఎస్ఎస్ఈ (ఎలక్ట్రికల్) తదితర అధికారులు తప్పనిసరిగా జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. డీఆర్ఎం తదితర సబార్డినేట్ అధికారులు సైతం జోనల్ హెడ్‌క్వార్టర్స్‌కు తరచుగా వెళ్లాల్సి వస్తుంది. వీరు రైల్వే శాఖకు చెందినవారు కావడంతో సమావేశాలకు విశాఖపట్టణానికి వెళ్లాలంటే విమాన ప్రయాణం చేయడానికి వీలులేదు. రైలులోనే ప్రయాణించాలి. మీటింగ్‌కు వెళ్లడానికోరోజు, రావడానికో రోజు జర్నీ తప్పదు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే రైల్వే ఉద్యోగులను మొదట జోనల్ హెడ్ క్వార్టర్స్‌కు రెఫర్ చేస్తారు. అక్కడి నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి రెఫర్ చేయించుకోవాల్సి ఉంటుంది.

జోనల్ కేంద్రానికి రెండు రైళ్లే...

త్వరలో జోనల్ కేంద్రం సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణానికి బదిలీ కానుండగా, అక్కడికి వెళ్లడానికి గుంతకల్లు నుంచి కేవలం రెండంటే రెండు రైళ్లు మాత్రమే ఉన్నాయి. సికింద్రాబాద్‌కు లెక్కలేనన్ని రైళ్లు, అసంఖ్యాకంగా బస్సులు ఉండటంతో వెళ్లడం చాలా సులువుగా ఉండేది. విశాఖపట్టణానికి బస్సులో వెళ్లడం అసాధ్యం. రైళ్లలో వెళ్లాలంటే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, అమరావతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు రోజులు ముందుగానే ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది. లేదంటే విజయవాడకు వెళ్లి అక్కడి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అది కూడా దాదాపు నెలరోజుల ముందుగా రిజర్వేషన్ చేయించుకుంటే తప్ప.. బెర్త్ దొరకడం కష్టం. రాష్ట్రానికి కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకావాలి కనుక తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయంగా గుంతకల్లు జోన్‌ను ద.కో.జోన్‌లోకి మార్చుచేశారు. వాస్తవానికి పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా గుంతకల్లు రైల్వే డివిజన్‌ను సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లో కలపడం సరైన నిర్ణయంగా కనిపించదు. లింగ్విస్టిక్ ప్రాతిపదికన గుంతకల్లు రైల్వే డివిజన్‌ను ఏపీ జోన్‌లో ఉంచాల్సి వస్తోందని సమాధానం ఇస్తున్నారుగానీ, ద.మ.రైల్వేలో ఉన్న నాందేడ్ డివిజన్ మహారాష్ట్రకు చెందిన ప్రాంతంగా ఉంది. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రాంతాలు కూడా ఉన్నాయి. జిల్లాకు చెందిన హిందూపురం, పెనుకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాలు నైరుతి రైల్వే పరిధిలో ఉన్నాయి. అవేవీ పట్టించుకోకుండా గుంతకల్లు రైల్వే డివిజన్‌ను దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి చేర్చేశారు. రాయలసీమ వాసులు, డివిజనల్ రైల్వే ఉద్యోగులు, అధికారులు విశాఖకు వెళ్లడం అలవాటు చేసుకోవాల్సిందే తప్ప.. మరో మార్గం లేదు.

బోగస్‌లు బద్దలు..!

(3వ పేజీ తరువాయి)

అంగీకరిస్తూ.. రాసిచ్చి వెళ్లాడట. అదే బయాలజీ పోస్టుకు మరో అభ్యర్థిని ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ఎంపిక చేసి పంపారు. వెరిఫికేషన్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్ చూపాలని అడగ్గా.. తన దగ్గర లేదన్నారట. అలా అయితే అనర్హుడవని చెప్పగా.. తన సెలెక్షన్ రద్దు చేయాలని రాసిచ్చి వెళ్లాడట. ఆ అభ్యర్థి కూడా సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు చెప్పారట. అంటే ఇక్కడ ఈ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ఎలా దరఖాస్తు చేసుకున్నారన్నది అంతుచిక్కని విషయం. అవకాశం వస్తే టీచర్ ఉద్యోగానికివెళ్లేవారే. పరిశీలన పక్కాగా చేస్తుండడంతో దొరికిపోయారు. ఇపుడు చేస్తున్న ఉద్యోగాలుకూడా ఇలాగే ఎక్స్‌సర్వీస్‌మెన్‌గానీ, ఇతర బోగస్ సర్టిఫికెట్లు చూపించిగానీ పొందారా..అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం

డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ పేరుతో బోగస్ సర్టిఫికెట్లను పెట్టారని సెలెక్ట్ అభ్యర్థులపై ఫిర్యాదులు అందాయి. వారి వివరాలతో కలెక్టర్, డీఈఓకి ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని రీ వెరిఫికేషన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఈడబ్ల్యూఎస్ కింద ఎంపికై ఆరోపణలు వస్తున్న ఆరుగురు అభ్యర్థులకు సర్టిఫికెట్లను జారీచేసిన తహసీల్దార్లతో పంపి, వాస్తవ సమాచారం పంపాలని కోరారు. మూడురోజులైనా రెవెన్యూ అధికారులు వాటి గురించి సమాచారం జిల్లా విద్యాశాఖకు పంపలేదు. అభ్యర్థుల ఫైనల్ ఎంపిక జాబితాసిద్ధం చేయడానికి యంత్రాంగం సిద్ధమవుతోంది. రెవెన్యూ పరిశీలనకు పంపిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒరిజినలా, బోగసా.. అన్నది తేల్చలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఎటూ తేలక టెన్షన్ పడుతూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

పీహెచ్ సర్టిఫికెట్లపైనా సందిగ్ధత

పీహెచ్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లపైనా సందిగ్ధత కొనసాగుతోంది. కురబ శ్రీనివాసులు అనే అభ్యర్థి ఎంఐ (బుద్ధిమాంద్యత) కోటాలో ఎంపికయ్యారు. ఆయనను జిల్లా ఆస్పత్రికి వెళ్లి వైద్యుడితో పరీక్షించుకుని రావాలని చెప్పగా.. అక్కడకు వెళ్లి డాక్టర్లకు చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారట. దీంతో సంబంధిత డాక్టర్.. ఆ అభ్యర్థి పరిశీలన చేయించుకోకుండా వెళ్లిపోయారని విద్యాశాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ అభ్యర్థి ఎంపికను పరిశీలన బృందం రిజెక్ట్ చేసింది. ఆ తర్వాత సంబంధిత అభ్యర్థికుటుంబసభ్యులు కమిషనర్ వద్దకెళ్లి తాము పారిపోలేదనీ, సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న పీవీకేకే కళాశాల వద్దకే వెళ్లామనీ, న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్.. నేరుగా డీఈఓనే ఆ అభ్యర్థిని తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించాలని ఆదేశించారు. దీంతో గురువారం జిల్లా ఆస్పత్రికి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీఓ మంజునాథ్.. సంబంధిత అభ్యర్థిని తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించారు. మరో సెలెక్ట్ అభ్యర్థి తమకు ఇటీవల జారీచేసిన సదరం సర్టిఫికెట్‌లో 50శాతంపైగా వైకల్యం ఉన్నట్లు పేర్కొన్నారనీ, తాజాగా 35శాతం ఇచ్చి తనకు అన్యాయం చేస్తున్నారని కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఆ అభ్యర్థికి ప్రత్యేకంగా కారు సమకూర్చి పరిశీలన నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో తుది జాబితా విడుదల సందిగ్ధంలో పడింది. ఈడబ్ల్యూఎస్, పీహెచ్ కోటాల అభ్యర్థుల వ్యవహారం తేలేవరకు జాబితా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యాశాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు ఉమ్మడి జిల్లాలో పడనున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.7-34.1 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.3-23.4డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 13-14 కి.మీవేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

7న ఆలయం మూత

గుంతకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని నెట్టికంటి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం విజయరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9-50 గంటల నుంచి 8వ తేదీ తెల్లవారు జాము 12-24 గంటల వరకు చంద్రగ్రహణం ఉందని, మధ్యాహ్నం 1 గంటకు ఆలయాన్ని మూసివేయడం జరుగుతుందన్నారు. సోమవారం తెల్లవారుజామున నాలుగున్నరకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 6 గంటలకు స్వామివారి దర్శనం ఉంటుందన్నారు.

రైళ్ల హాల్ట్ హర్షణీయం

● ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన విజ్ఞప్తి మేరకు రైల్వే బోర్డు గుత్తి, తాడిపత్రి స్టేషన్లలో రైళ్ల హాల్ట్‌కు వెసలుబాటు కల్పించడం హర్షణీయమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుత్తి, తాడిపత్రి ప్రాంతాల ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తాను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లానన్నారు. గుత్తి రైల్వేస్టేషన్‌లో ట్రైన్ నెంబర్లు 16351, 16352, తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో ట్రైన్ నెంబర్లు 16352, 17622, 20953 హాల్ట్‌కు బోర్డు అవకాశం కల్పించిందన్నారు.

రేపు వామపక్షాల నిరసనలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమెరికా టారిఫ్‌లను నిరసిస్తూ ఈనెల 6న జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు తెలిపారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు నల్లప్ప, నారాయణ స్వామి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌యూసీఐసీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం దేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఏపీ నుంచే ఎగుమతి అవుతున్నాయన్నారు. టారిఫ్ పెంపుతో రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికుల ఉపాధికి ప్రమాదం పొంచి ఉందన్నారు. భారత ఎగుమతులపై సుంకం పెంచి, అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలనీ, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని అమెరికా షరతులు పెడుతోందన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోదీ సర్కారు కిమ్మనకపోవడం గర్హనీయమన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని మండల, పట్టణ ప్రాంతాల్లో నిరసనలు చేపడతామన్నారు. అన్నివర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

న్యూస్ బాక్స్

స్వామిని తాకిన సూర్యకిరణాలు



తాడిపత్రి సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామిని సూర్యకిరణాలు గురువారం తాకాయి. ఏటా చైత్ర, బాద్ర మాసాల్లో బుగ్గ రామలింగేశ్వరస్వామిని సూర్యకిరణాలు తాకుతాయని వేద పండితుడు రవి శర్మ తెలిపారు. వాటిని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఎరువు దుకాణాల తనిఖీ

గుత్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ, సింధూ, సాయి కృష్ణ ఫర్టిలైజర్స్, ధనలక్ష్మి సీడ్స్ తదితర షాపులను విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తన సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. నిల్వల్లో తేడా ఉన్నందున రూ.4.33 లక్షల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. యూరియా రూ.266 కంటే అధిక ధరకు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, అగ్రికల్చర్ అధికారి వాసు, ఏడీఏ వెంకటరాముడు, ఏఈ ముస్తాక్అహ్మద్ ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

యాడికి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల స్థానంలో త్వరలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు మండలానికి చెందిన 11 వేల స్మార్ట్ కార్డులు కార్యాలయానికి వచ్చాయని, త్వరలోనే వీటిని లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

యాడికి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరిని ఎంపిక చేసినట్లు ఎంఈఓ కాశెప్ప గురువారం తెలిపారు. రాయలచెరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డేనియల్, వెంగన్నపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డిని జిల్లా స్థాయిలో ఎంపిక చేశారన్నారు.

రిజర్వాయర్‌కు 2,144 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,144 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,104 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.695 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1,940 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు.

శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించండి

తాడిపత్రి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక శివాలయం సమీపంలోని హిందూ శ్మశాన వాటికను పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రా రెడ్డి, కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వైద్యులు

ఉరవకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో చిన్నపిల్లలు, దంత వైద్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొనకొండ్లలో పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యురాలు తేజప్రతిమ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. అలాగే కల్యాణదుర్గంలో పనిచేస్తున్న దంతవైద్యురాలు రాధారాణి ప్రమోషన్‌పైన ఇక్కడికి వచ్చారు.

బార్ ఏర్పాటుకు రీనోటిఫికేషన్

గుత్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బార్ ఏర్పాటుకు రీనోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి గురువారం తెలిపారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15న అనంతపురంలో ఎక్సైజ్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో బార్‌ను కేటాయిస్తామన్నారు.

జగనన్న కాలనీలో సౌకర్యాల లేమి



జగనన్న కాలనీలో ఉన్న మట్టిరోడ్డు

కూడేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం-బళ్లారి ప్రధాన పక్కనే వైసీపీ పాలనలో జగనన్న కాలనీలో దాదాపు 45 మందికి ప్లాట్లు మంజూరు చేశారు. ఇందులో తొమ్మిది మంది మాత్రమే ఇంటి నిర్మాణపు పనులు పూర్తి చేశారు. మిగిలిన ప్లాట్లలో కొన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉండగా.. మరిన్ని పునాదులకే పరిమితమయ్యాయి. కాలనీలో వీధి దీపాలు, సీసీ రోడ్లు తదితర కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో వీధి దీపాలు, సీసీ రోడ్లు తదితరు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారుపై పారుతున్న మురుగు



రోడ్డుపై పారుతున్న మురుగు

కుందుర్పి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలు లేకపోవడంతో ముర మండల కేంద్రంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రధాన రోడ్డు, వీధుల్లోనే మురుగు ప్రవహిస్తోంది. రోడ్లపైన, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అలా నిల్వ ఉన్న మురుగు నీటిలోనే తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయని, ఆ పైపులు చిలుం పట్టాయని, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి గుండా మురుగునీరు ప్రవహిస్తూ ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలోకి చేరుతోందని, దీంతో రోగులు, సిబ్బంది దుర్వాసనతో ఇబ్బందు లు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి మురుగుకాలువలను ఏర్పా టు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆస్పత్రి ఎదుట నిల్వ ఉన్న మురుగు

నిర్మించారు.. వదిలేశారు..!

- నిరుపయోగంగా మూడు గోదాములు
- రూ.కోటి ప్రజాధనం వృథా
- అద్దె భవనాల్లోనే విత్తనాలు, ఎరువులు నిల్వ

పుట్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు రూ. కోట్ల ప్రజాధనంతో నిర్మించిన మూడు గోడౌన్లు నిరుపయోగంగా ఉన్నాయి. చింతకుంట రోడ్డులో 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. అలాగే 2022లో వైసీపీ ప్రభుత్వం ఎంపీడీఓ కార్యాలయం వద్ద, శెనగలగూడూరు వద్ద గోదాములను నిర్మించింది. గతంలో మండలానికి కేటాయించిన విత్తనాలు, ఎరువులు వేరే బిల్డింగులను అద్దెకు తీసుకొని.. నిల్వ చేసేవారు. అయితే అనంతరం గోదాములను నిర్మించినా.. వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా పాలకులు, అధికారులు ఏ మాత్రం చర్యలు చేపట్టలేదు. దీంతో ఆ మూడు గోదాములూ నిరుపయోగంగా పడిఉన్నాయి. మండలానికి కేటాయించిన విత్తనాలు, ఎరువులను నేటికీ అధికారులు అద్దె భవనాల్లోనే నిల్వ చేస్తుండటం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాములను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన గోదాము



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం అభివృద్ధికి సహకరించండి

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి సహకరించాలని పారిశ్రామికవేత్తలను విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. జిల్లా స్పాంజ్ ఐరన్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కేంద్రంలో నిర్మించిన కళ్యాణమండపాన్ని గురువారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎవరైనా ముందుకు వస్తే వారికి అనువైన భూమిని కేటాయించటంతో పాటు రాయితీలు, ఇతర సౌకర్యాలు కూటమి ప్రభు త్వం ద్వారా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ పాటిల్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు తలారి గంగాధర, మొండి మల్లికార్జున పాల్గొన్నారు.

● రేపు సమావేశం

రాయదుర్గం రూరల్ : సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మంటపంలో శనివారం మధ్యాహ్నం సమావేశం నిర్వహిస్తున్నట్లు విప్ కాలవ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షుడు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరవుతారన్నారు.

● నేడు మాల్యంలో..

కణేకల్లు : మాల్యంలో మల్లేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందులో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొంటారని మండల కన్వీనర్ లాలెప్ప తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుదాం



మాట్లాడుతున్న తెలుగు వ్యాఖ్యాత శ్యాంసుందర్ శాస్త్రి

కుందుర్పి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆల్ ఇండియా రేడియో సీనియర్ వ్యాఖ్యాత జిగర్లపూడి శ్యామసుందర శాస్త్రి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా శాస్త్రితో పాటు అష్టావధాని గురివేపాలి నరసింహులు హాజరయ్యారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు తెలుగు భాష గొప్పతనం, సాంప్రదాయాలు, అలవాట్లను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు గోపి, తెలుగు భాష గేయకుడు మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విడపనకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెం దిన దళిత యువకుడు ఉలిగన్నపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి.. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. డీజీహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు మీనుగ గోపాల్ మాట్లాడుతూ.. మొత్తం తొమ్మిది మంది దాడి చేయగా.. ముగ్గురిపైనే కేసు నమోదు చేశారని, మిగిలిన వారిపై కూడా కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను ఆదివారం లోపు అరెస్ట్ చేయాలని, లేకుంటే సోమవారం జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాబాల సర్పంచ్ జగదీష్, పాల్తూరు ఆనంద్‌రా జు, లత్తవరం చంద్రశేఖర్, చీకలగురికి మారెన్న, సీపీఐ చెన్నరాయుడు, సాకే వన్నూరప్ప, ఎల్లన్న, రమేష్, బలరాం పాల్గొన్నారు.

దుర్భాషలాడటం ఎమ్మెల్యేకు తగదు

గుత్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతు సంఘం నాయకులపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దుర్భాషలాడటం తగదని సీపీఐ, సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. ఎమ్మెల్యే బెదరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామదాస్, కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, బీఎస్పీ నాయకులు నాగభూషణం, కొండయ్య, కేవీపీఎస్ నాయకులు మల్లికార్జున, డీవైఎఫ్ఐ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

రెండు షాపుల్లో చోరీ

8 కేజీల వెండి, రూ.4 లక్షల నగదు అపహరణ

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండు దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. హెచ్‌ఆర్‌జీ కాంప్లెక్స్‌లోని ఓ వైన్ షాపు, ఏఆర్ జ్యువెలరీ దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గురువారం యజమానులు షాపుల వద్దకు కిటికీలు పగిలివుండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జ్యువెలరీ షాప్‌లో 8 కేజీల వెండి, కొన్ని బంగారం ఆభరణాలు, వైన్‌షాపులో రూ. 4 లక్షల నగదు చోరీకి గురైనట్లు దుకాణదారులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్ .. సూపర్ హిట్.. విజయోత్సవసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజావేదిక వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన భార సమావేశంలో ఆయన మాట్లాడారు. మన నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివెస్తే.. అభివృద్ధికి అవసరమైన నిధులు అడిగేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ భారీ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా పాల్గొంటున్నారని, ఈ సభను విజయవంతం చేసే దిశగా ప్రతి గ్రామం నుంచి జనం భారీగా తరలిరావాలని అన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి వెళుతున్న వినాయకనగర్ వినాయకుడు

కణేకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకనగర్, సిద్ధప్ప గుడి, రామాలయ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. పురవీధులలో భారీగా ఊరేగించారు. రామ్ నగర్‌లోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక పూజలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సున్నీరోషన్ మసీదులో అన్నదానం



మసీదు వద్ద నిర్వహిస్తున్న అన్నదానం

గుత్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మిలాదునబీ సందర్భంగా స్థానిక గుత్తి ఆర్ఎస్‌లో సున్నీ రోషన్ మసీదులో గురువారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇందులో సున్నీ రోషన్ మసీదు మతవల్లి ఖాజాఖాన్, కార్యదర్శి ఖలందర్, కోశాధికారి మస్తాన్‌వలి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆ పార్టీ నాయకులతో ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో తరచూ కరెంట్ కోతలతో గర్భవతులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంచాల మీద బెడ్‌సీట్లు వేయటం లేదని అన్నారు. ఆసుపత్రికి ప్రతి రోజూ సుమారు 700 మంది రోగులు ఓపీకీ వస్తుంటారని, ఆసుపత్రిలో ఏ విభాగం ఎక్కడ ఉందో .. ఏ వైద్యుడు ఎక్కడ ఉన్నారో... తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు జిలాన్, రామాంజినేయులు, రామ్‌దాస్, నారాయణ, భాషా, విశ్వనాథ్, నాగార్జున, జానయ్య ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన జిల్లా నాయకుడు



కూడేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుని టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రోలర్ నాగరాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు.

టీడీపీ కమిటీ సభ్యుల ఎంపిక

బెళుగుప్ప, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండల కమిటీ, గ్రామ కమిటీ, సహకార సంఘం కమిటీల నియామకంపై చర్చించారు. ఆశావహుల పేర్లు సేకరించి మంత్రి పయ్యావుల కేశవ్‌కు పంపారు. ఇందులో సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, పెద్దతిప్పయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, దుద్దేకుంట తిమ్మప్ప, విరుపాపల్లి, రాధాకృష్ణ సర్పంచ్ రాము, రుద్రయ్య, బాలాజీ, వన్నూరుస్వామి, యర్రిస్వామి, పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ పీ గోపాల్‌ను సన్మానించారు. ఇందులో ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు వెంకటరమణ, కృష్ణయ్య, గోపి, నటరాజ్, కురుపాటి రాకేష్, వరప్రసాద్, అమీర్, వెంకటసుబ్బమ్మ, వైశాలి, శివయ్య పాల్గొన్నారు.

● ఉరవకొండ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆదినారాయణను, అధ్యాపకులు పరమేష్, వెంకటరాముడు, విద్యార్థులు సన్మానించారు.





గుంతకల్లులో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ గోపాల్, ఉరవకొండలో ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

క్రైం న్యూస్ ..

విషజ్వరంతో బాలుడి మృతి

ఉరవకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన తనుష్ (6) గురువారం విష జ్వరంతో మరణించాడు. ఈ గ్రామానికి చెందిన రామాంజినేయులు, సుహాసిని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెండో కుమారుడైన తనుష్‌కు జ్వరం రావడంతో స్థానిక పీహెచ్‌సీలో చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో ఉరవకొండ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించి, డెంగీ లక్షణాలు ఉన్నాయని వైద్యుల చెప్పారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లాలని సూచించారన్నారు. అనంతపురంలో రెండు రోజుల నుంచి చికిత్స పొందుతూ గురువారం ఉదయం తనుష్ మరణించాడు.

ఆటో ఢీకొని కార్మికుడు ..



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

పుట్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు - శనిగలగూడురు గ్రామాల శివారులో ఆటో ఢీకొని యస్.వెంగన్నపల్లికి చెందిన అంబటి సుధాకర్‌రెడ్డి (38) మరణించాడు. ఇతను తాడిపత్రి మండలం బుగ్గ సమీపంలోని అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. గురువారం ఉదయం బైక్‌లో విధులకు వెళ్తుండగా .. ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో సుధాకర్‌రెడ్డిని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. సుధాకర్‌రెడ్డికి భార్య హైమావతి, మూడేళ్ళ కుమార్తె వంశిక ఉన్నా రు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రెహమాన్ తెలిపారు.

వాహనాలు ఢీకొని మరొకరు ..



వన్నూరుస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి ఆటో బొలెరో ఢీకొన్న ప్రమాదంలో రాయదుర్గం మండల మల్లాపురం వాసి వన్నూరుస్వామి (39) అక్కడికక్కడే మరణించాడు. ఇతను గురుమూర్తితో కలిసి ఆటో రిపేరీ కోసం అనంతపురం వెళ్లారు. ఆటో రిపేరీ అనంతరం రాయదుర్గానికి వస్తుండగా..గోళ్ల సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వన్నూరుస్వామి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్నికళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్నూరుస్వామికి భార్య జ్యోతి, కుమారుడు, కూమార్తె ఉన్నారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడ్డ గురుమూర్తిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గంరూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మండలం రాంపూరం గ్రామానికి చెందిన రమేష్ స్థానిక ఎస్సీ కాలనీలో విష ద్రావకం తాగి .. గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రమేష్ పట్టణంలోని అత్త ఇంటికి వచ్చి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భర్తపై దాడి

ఉరవకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలో ఓబులేశు నిత్యం మద్యం తాగేవాడు. మత్తులో భార్య ఉలిగమ్మతో నిత్యం గొడవ పడేవాడు. దీంతో విసుగుచెందిన ఉలిగమ్మ గురువారం తన భర్తపై కర్రతో దాడి చేసింది. గాయపడ్డ అతన్నిఅనంతపురం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్ సైడ్ బ్యాగులో నగదు చోరీ

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీబజార్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో ఉంచిన రూ. 1.70 లక్షల నగదు చోరీ అయింది. గుమ్మఘట్ట మండలం జే వెంకటంపల్లి గ్రామానికి చెందిన వడ్డే కుళ్లాయప్ప గురువారం మధ్యాహ్నం ముత్తూట్ ఫైనాన్స్‌లో గోల్డ్ తాకట్టు పెట్టి రూ. 1.70 లక్షలు తీసుకున్నాడు. ఆ నగదును బైక్ సైడ్‌బ్యాగ్‌లో ఉంచుకుని టీ తాగేందుకు ఆపాడు. టీ తాగేలోపు బైక్‌లోని నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

12 మోటార్ల కేబుల్ చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్ఐ

బెళుగుప్ప, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి తండాలో బుధవారం రాత్రి 12 వ్యవసాయ మోటార్లకు ఉన్న వైర్లు, రెండు స్టార్టర్లను దుండగులు అపహరించారు. ఒకేసారి అధిక సంఖ్యలో తోటలలో చోరీ జరగడం ఇదే మొదటి సారి. వీటి విలువ సుమారు రూ. లక్షకు పైగా ఉంటుందని బాధిత రైతులు గోపాల్‌నాయక్, రాజు వాపోయారు. బాధితులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ట్రైనీ ఎస్ఐ మల్లేష్ పరిశీలించారు.


కేసు నమోదు

యల్లనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచివారిపల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి సుబ్బానాయుడు, అతని కుమారుడు చక్రపాణి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.


ఇద్దరి అరెస్ట్

తాడిపత్రి సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వినాయక నిమజ్జనం ఊరేగింపులో జరిగిన ఘర్షణకు సంబంధించి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయుడు లింగమయ్యను, కాకర్ల రంగనాథ్ వర్గీయులను పోలీసులు గురువారం అ రెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విజయ్‌భాస్కర్



ఉరవకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరిశెట్టి విజయ్‌భాస్కర్ నియమితులయ్యారు. ఆయన 15ఏళ్లుగా మండల కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.



● తాడిపత్రి : నియోజకవర్గంలోని మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా భూమ నాగరాగిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆమె ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం

తాడిపత్రి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని స్థానిక అశోక్ పిల్లర్ సమీపంలోని సిద్దిబాషా దర్గా వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని తాడిపత్రి అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ప్రారంభించి.. రక్తదానం చేశారు. ఈ శిబిరంలో దాదాపు వంద మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ హయ్యద్ బాషా ఖాద్రీ, జిలాన్, జావిద్, జాఫర్, ఖాజా పాల్గొన్నారు.